నగర వనం..
నిధులకు దైన్యం

గత ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన నగరవనం పార్కు(బేటరాయస్వామి ఎకో పార్కు) ప్రస్తుతం మూతపడింది. అప్పట్లో 2 కోట్ల రూపాయలతో ప్రారంభించిన పార్కు నిర్మాణ పనులు ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయి. పనులు జరుగుతున్నా పర్యాటకులను అనుమతించేవారు. ప్రస్తుతం పనులు పూర్తికాక, పర్యాటకులు రాక పార్కు మూతపడింది.

- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పార్కు
- పూర్తిస్థాయి నిధులు రాక ఆగిన నిర్మాణ పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- సందర్శకులను అనుమతించకపోవడంతో తప్పిన కళ
- త్వరలో ప్రారంభిస్తామంటున్న అటవీశాఖ అధికారులు


మూతపడ్డ నగరవనం ముఖద్వారం

కుప్పం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రెండు సంవత్సరాల క్రితం కుప్పం మండలం నడుమూరు అటవీ ప్రాంతంలో జాతీయ రహదారికి ఆనుకుని నగరవరం (బేటరాయస్వామి ఎకో పార్కు) పేరిట అటవీశాఖ ఆధ్వర్యంలో పార్కు నిర్మాణానికి పూనుకున్నారు. అధికారులు సుమారు 1.20 కోట్ల వరకు వెచ్చించి 60 శాతం వరకు పనులు పూర్తి చేశారు. పనులు ఓ వైపు జరుగుతున్నప్పటికీ పర్యాటకులను అనుమతించేవారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకెళ్లి వారాంతం, సాయంత్రాలు ఆనందంగా గడిపేవారు. పెద్దలు సైతం మానసిక ప్రశాంతతకు ఇటు వచ్చేవారు. క్రమంగా నిధులు రాకపోవడంతో అధికారులు పూర్తిస్థాయి పనులు చేయలేకపోయారు. దీంతో పర్యాటకుల సందర్శనలు నిలిపివేసి పార్కును మూసివేశారు. దీంతో కోటికి పైగా వెచ్చించిన ప్రజాధనం వృథా అయ్యింది.

పార్కులో చేయాల్సిన పనులు

నగరవనం పార్కు పూర్తి కావాలంటే రాశివనం చెట్లు, విద్యుత్, ఫుట్‌బాత్, బ్యూటీషియన్, ఆర్నమెంట్ చెట్ల పెంపు, గ్రీన్ గ్రాస్..ఇత్యాది పనులు చేయాల్సి ఉంది. దీనికి తక్కువ మొత్తంలో నిధులు ఉంటే చాలు. ఆ తక్కువ మొత్తాన్ని కూడా కూటమి ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో పార్కు కళ తప్పింది. నిర్మాణాలు అర్థాంతరంగా ఆగి, మూతపడే పరిస్థితి దాపురించింది.

ఇటు చూడు ×బాబూ₹..!

కుప్పం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్నా నగరవనం పనులు పూర్తి చేయించి సరికొత్త సొబగులతో ప్రారంభించాలనే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి కొరవడిందా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. జాతీయ రహదారికి పక్కనే పార్కు ఉండడంతో ప్రయాణికులు సైతం ఇక్కడ సేదతీరే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలకు పైబడుతున్నా నగరవనం పార్కు వైపు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.


నిరుపయోగంగా ఉన్న పార్కులోని పిల్లల ఆట వస్తువులు


మార్చికి ముందు పార్కులో పిల్లలు, పెద్దల సందడి దృశ్యం (ఫైల్)

త్వరలో పూర్తి చేస్తాం

నగరవనం పార్కులో ఇంకా కొంత పనులు చేయవలసి ఉండడంతో మూసివేశాం. నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. త్వరలో నిధులు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. జనవరి నెలాఖరులోపు పార్కు పూర్తి చేసి పర్యాటకులను అనుమతిస్తాం.

–జయశంకర్, ఫారెస్ట్ రేంజర్, కుప్పం

క్లుప్తంగా

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కుప్పం: కుప్పం పరిధిలో వారం వ్యవధిలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ నిర్వహించిన దాడుల్లో 132 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం మండలం మెట్లచేను గ్రామ అటవీ సరిహద్దుల్లో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,200 లీటర్ల సారా ఊటను సైతం ధ్వంసం చేసినట్లు తెలియజేశారు. ఈ దాడుల్లో ఏడు కేసులు నమోదు చేసి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన దాడుల్లో శాంతిపురం బస్ స్టేషన వద్ద బోయిన పల్లెకు చెందిన కృష్ణప్ప నుంచి 30 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

23, 24న నేషనల్ సెమినార్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23, 24వ తేదీల్లో 'ఎంపవరింగ్ ఉమెన్– ప్రమోటింగ్ ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నేషనల్ సెమినార్ నిర్వహించనున్నట్టు కళాశాల అధ్యాపకులు రుక్మిణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మఠం నిర్మాణానికి భూమి పూజ


మఠం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బ్రాహ్మణ సంఘ సభ్యులు

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని సాయిబాబా ఆలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు జగద్గురు ఆది శంకరాచార్యుల మఠం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు.రూ.10 లక్షలతో మఠం నిర్మించనున్నట్టు సంఘ సభ్యులు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు చర్యలు


మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా 4వ రోజు ఆదివారం రామకుప్పం మండలంలోని చెల్దిగానిపల్లెలో 'మహిళలతో భువనమ్మ' పేరిట ముఖాముఖి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి మూడు నెలలకోసారి తాను కుప్పం పర్యటనకు వస్తానన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. కుప్పం నుంచి ఇకపై వలసలు ఉండవని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌడ కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మాజీ మంత్రి ప్రభాకర్‌గౌడ్


మాట్లాడుతున్న ప్రభాకర్‌గౌడ్

బంగారుపాళెం: గౌడ కులస్తులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని మాజీ మంత్రి ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయం ఆవరణలో గౌడ కులస్తుల 21వ వన భోజన మహోత్సవాన్ని రాష్ట్ర కార్యదర్శి బుసా నాగరాజగౌడ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి గౌడ్, ప్రధాన కార్యదర్శి గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధి చెందాలంటే కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాత జయప్రకాష్ నారాయణగౌడ్, సుధాకర్‌గౌడ్, శంకరావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుడిపాల: మండలంలోని కిల్లారిపల్లె ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం పేకాట ఆడుతున్న గ్రామస్తులు కుప్పుస్వామి(34), శివ(36), గణేష్(65), సుదర్శన్(36)ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.1,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. జూదం నిర్వహిస్తుంటే 9440796172కు సమాచారం అందించాలని కోరారు.

ఆదర్శపాఠశాల విద్యార్థులకు దుస్తుల వితరణ


దుస్తులు వితరణ చేస్తున్న సంస్థ సభ్యులు

వి.కోట: ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులకు తమవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తామని శ్రీ సత్యసాయి సేవా సంస్థ సభ్యులు అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిగార్డెన్‌లోని ప్రత్యేక ప్రతిభావంతుల ఆదర్శ పాఠశాల విద్యార్థులకు దుస్తులు వితరణ చేసి సంస్థ సభ్యులు మాట్లాడారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వసంత, హేమలత, వాసవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

27న బ్యాడ్మింటన్ టోర్నీ

సదుం: స్థానిక బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 27న మండల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డబుల్స్ విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో విన్నర్స్, రన్నర్స్‌కు రూ.5 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 26వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 6300804993, 9885234892 నంబర్లను సంప్రదించాలన్నారు.

శంకరప్ప కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఏనుగుల కట్టడికి చర్యలు తీసుకోని ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శ


శంకరప్ప మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన శంకరప్ప కుటుంబాన్ని ఆదుకోవాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ కోరారు. మండలంలోని కుప్పనపల్లె అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు శంకరప్పపై దాడి చేయడం విదితమే. ఆదివారం కుప్పనపల్లెలో శంకరప్ప మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే నివాళులు అర్పించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో తరచూ ఏనుగులు పంటలను ధ్వంసం చేయడం, రైతులపై దాడులు చేయడం చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. కుటుంబానికి పెద్దదిక్కైన శంకరప్ప మృతి ఆ కుటుంబానిక తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచులు రవిచంద్ర, వెంకటేష్, పార్టీ నేతలు లక్ష్మీ నారాయణ, ప్రభాకర్ రెడ్డి, రవికుమార్, మణి, రాజేంద్ర, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సదుం: మండలంలోని జోగివారిపల్లె వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం హోమాలు, కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ శాస్త్రోక్తంగా అర్చక, వేద పండితులు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు.


ప్రత్యేకాలంకారంలో ఉత్సవమూర్తులు


కల్యాణోత్సవంలో భక్తులు

రామకుప్పం వాసికి 'గురు పురస్కార్' అవార్డు


గురు పురస్కార్ అవార్డును అందుకున్న మంజునాథ్

రామకుప్పం: తమిళనాడులోని వేలమ్మాల్ వేల్స్ విద్యాలయంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రామకుప్పం వాసి మంజునాథ్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గురు పురస్కార్ అవార్డు వరించింది. రీఛార్జ్ బ్యాటరీ పితామహుడు డాక్టర్ చివుకుల హనుమంతరావు ఛారిటబుల్ ట్రస్ట్, సుగుణ సైన్సు అకాడమీ (గుంటూరు) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 14 రాష్ట్రస్థాయి అవార్డులను ప్రకటించింది. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వారికి, సామాజిక సేవలను అందించి వారికి వీటిని ప్రదానం చేసింది. ఆదివారం గుంటూరు అమరావతిరోడ్డులో హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో మంజునాథ్‌ను అవార్డుతో సత్కరించారు. అతడిని రామకుప్పం గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్మోహన్ రావు, ఇస్రో శాస్త్రవేత్తలు, నాగార్జున విశ్వవిద్యాలయ ఆచార్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళా తరంగిణి ప్రదర్శనలు


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు సమీపంలోని రాయల్ మహల్ కల్యాణ మండపంలో ఆదివారం కళా తరంగిణి సంస్థ నిర్వహించిన సాంస్కృతిక, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. జిల్లాలో నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వందలాది మంది కళాకారులు నృత్యపోటీల్లో తమ విద్వత్తును చాటారు. విజేతలకు కళాతరంగిణి వ్యవస్థాపక కార్యదర్శి రాజేష్‌బాబు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు మస్తాన్, నారాయణ, సంధ్య, కళా తరంగిణి సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సదుం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం..మండలంలోని జాండ్రపేటకు చెందిన వంశీ మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంలో సోమల వైపు బయలుదేరాడు. గొంగివారిపల్లె పంచాయతీలోని నాగిరెడ్డి చెరువుకట్ట మలుపు వద్ద ఓ ప్రైవేటు బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. గాయపడ్డ వారిని పీలేరుకు తరలించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పలమనేరు: మండలంలోని కల్లాడులో ప్రబోధ సేవా సమితి నిర్వాహకులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. జీవాత్మ, పరమాత్మను గురించి ఈ పుస్తకాల్లో విపులంగా ఉందని, దీనిని చదివి జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలని ప్రజలను కోరారు. ఆ గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. నిర్వాహకులు భాస్కర్, బాలాజీ, జ్యోతి, రెడ్డెమ్మ, హేమంత్ పాల్గొన్నారు.

ఘనంగా 'సపోజ్ క్రిస్మస్'


ప్రార్థనా మందిరంలో కీర్తనలతో యేసుక్రీస్తును స్తుతిస్తున్న క్రైస్తవులు

పుంగనూరు: పట్టణంలో కొత్తపేటలోని ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో ఆదివారం సపోజ్ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. పాస్టర్ జీవన్‌బాబు వాక్య సందేశమిచ్చారు. క్రిస్మస్ ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రార్థనలు చేసి, యేసుక్రీస్తును స్తుతిస్తూ కీర్తనలు పాడారు. కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మూడు నెలల్లో పరికరాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు: దివ్యాంగులకు అవసరమైన పరికరాలను మూడు నెలల్లో ఇవ్వనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బాలికోన్నత పాఠశాల వద్ద వికలాంగులు అవసరమైన పరికరాల గుర్తింపు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. పరికరాలను సంబంధిత ఏఎల్‌ఐఎంసీఓ సంస్థ ద్వారా ఎంపిక చేసిన వారికి అందజేస్తామన్నారు. ఆ శాఖ సహాయ సంచారకులు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ శిబిరానికి 861మంది హాజరు కాగా వీరిలో 835 మందికి అవసరమైన పరికరాలను ఇచ్చేందుకు ఎంపిక చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ భవాని, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి


ఏనుగులు విరిచేసిన కొబ్బరి చెట్టు, దెబ్బతిన్న వరి నారు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత కాలంగా పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాల రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. శనివారం రాత్రి పుంగనూరు ఫారెస్ట్ రేంజ్ పేటూరు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు పెద్దకాప్పల్లె గ్రామ సమీపంలోని పంటలపై విరుచుకుపడ్డాయి. జయారెడ్డి, కొండారెడ్డి తదితరుల కొబ్బరి, బొప్పాయి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. వరి నారును తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఏనుగుల వల్ల భారీగా నష్టపోతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతం నుంచి పొలాల్లోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.

'పుష్ప' అభిమానులు సైతం..!



వివిధ గ్రామాల్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అల్లు అర్జున్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు

- పార్టీలతో సంబంధం లేకుండా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

పలమనేరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు నియోజకవర్గంలోని అల్లు అర్జున్ అభిమానులు కూడా ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతోపాటు సినీనటుడు అల్లు అర్జున్ అభిమానులు సైతం ఈ పర్యాయం వేడుకలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. శనివారం రాత్రి నియోజకవర్గంలోని 40 గ్రామాల్లో ఈ కార్యక్రమాలు సాగాయి. జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలను తెలుపుతూ కేక్‌లు కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

వెంగంవారిపల్లెలో వైద్య శిబిరం


వెంగంవారిపల్లెలో జిల్లా మలేరియా అధికారి

బైరెడ్డిపల్లె: మండలంలోని వెంగంవారిపల్లెలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డెంగీ జ్వరంతో రక్షిత (12) మృతి చెందడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. జిల్లా మలేరియా అధికారి జయశంకర్ మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని కోరారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామాల్లో ఇంటింటా సర్వే చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, క్రీడాకారిణులతో నిర్వాహకులు

- వివరాలు జిల్లా 8లో

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్‌క్లబ్ ఆవరణలో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పోటీలకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు.

జేఏసీ నాయకులపై అక్రమ కేసులు సరికాదు

కాణిపాకం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లోని కేశ ఖండనశాలలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులను పర్మినెంట్ చేస్తామని జేఏసీ నాయకులు లక్షల రూపాయలు వసూలు చేశారన్న ఆరోపణలపై నిజానిజాలు పరిశీలించకుండానే కేసులు పెట్టడాన్ని కాణిపాకం దేవస్థానం కల్యాణకట్ట ఉద్యోగుల సంఘం సభ్యులు దామోదరం, ప్రభాకర్, మురళి శనివారం ఖండించారు. కూటమి ప్రభుత్వం కనీస వేతనం రూ.25 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీని నెరవేర్చే క్రమంలో కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.